www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 10 మే 2025



డబ్బులు వసూలు చేయడం దుర్మార్గం

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లావ్యాప్తంగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న అదనపు కార్మికుల దగ్గర కొంతమంది కాంట్రాక్టర్లు ప్రతి నెల రూ.500 వసూలు చేయడం దుర్మార్గమని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయ భాస్కర్, జిల్లా కోశాధికారి ఎస్. గోపి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, ఎర్రగుంట్ల, బద్వేలు, పులివెందుల, కడపలో అడిషనల్ వర్కర్స్‌ను కోవిడ్ కాలంలో తీసుకున్నారని పేర్కొన్నారు. వారికి రూ.12వేలు మాత్రమే ఇస్తారని తెలిపారు. పీఎఫ్, ఇఎస్ఐ కట్టడం లేదని పేర్కొన్నారు. కడప లాంటి ప్రాంతంలో మరీ ఎక్కువగా వసూలు చేస్తున్నా రన్నారు. ఇందుకు నిదర్శనం వర్కర్స్ బ్యాంక్ స్టేట్‌మెంట్ చూస్తే అర్థమవు తుందని తెలిపారు. మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకుని వర్కర్లకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని తెలిపారు.


'ఉపాధి' సిబ్బంది ఆకలి కేకలు!



రూ.126 కోట్ల మెటీరియల్ కాంపౌండ్ కోసం నిరీక్షణ
గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు గ్రహణం
కేంద్ర, రాష్ట్రాల ఉదాసీనతపై ఆందోళన

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉపాధి హామీ చట్టం కింద పనిచేసే సిబ్బంది ఆకలికేకలతో అలమటిస్తున్నారు. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని 66 మండలాల పరిధిలో వేలాది మంది ఉద్యోగులు ఐదు నెలలుగా వేతన యాతన అనుభవిస్తున్నారు. వీరందరూ చిన్నపాటి జీతాలతో ఉపాధి హామీ చట్టాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. ఇటువంటి చిరుద్యోగులకు సకాలంలో జీతాలు విడుదల చేయడంలో కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఉపాధి అమలు కారణంగా నిరుద్యోగ సమస్య ఉధృతి తగ్గుదల, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుదలల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఇటువంటి ఉపాధి హామీ ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడడం ఆందోళన కలిగిస్తోంది. మొన్నటి వరకు లేబర్ కాంపౌండ్ నిధుల విడుదలలో తాత్సారం, తాజాగా మెటీరియల్ కాంపౌండ్ నిధుల విడుదలలో జాప్యం చేయడం కలవరాన్ని కలిగిస్తోంది.



జిల్లాలో ఉపాధి హామీ పథకం ఉద్యోగుల్లో నిర్వేదం నెలకొంది. కొన్నేళ్లుగా ఉపాధి హామీ చట్టం అమలులో జిల్లా ముందంజలో నిలుస్తోంది. ఉపాధి హామీ చట్టం అమలులో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న ఎపిఒ, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర స్టాఫ్ సిబ్బంది వివిధ కేటగిరీల కింద 2 వేల మంది ఉద్యోగులకు జీతాలు నిలిపేయడం ఆందోళన కలిగిస్తోంది. ఉపాధి హామీ చట్టరూపం దాల్చడం ద్వారా దేశంలో నిరుద్యోగం పెచ్చరిల్లకుండా చేస్తోంది. దీంతోపాటు ప్రజల్లో కొనుగోలుశక్తి పెరుగుదలలో కీలకపాత్ర పోషిస్తోంది. ఇంతటి బృహత్తర ప్రగతిలో పాలు పంచుకున్న చిరుద్యోగుల పట్ల చిన్నచూపు చూడడం ఆందోళన కలిగిస్తోంది.

5 నెలలుగా ... నిరీక్షణ

2024 డిసెంబర్ నుంచి మే రెండో వారం వరకు ఉద్యోగులకు జీతాలు విడుదల చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈలెక్కన మెటీరియల్ కాంపౌండ్ నిధుల కింద విడుదల చేయాల్సిన సుమారు రూ.100 కోట్లలో ఐదు నుంచి 10 శాతం మేర ఉద్యోగులకు జీతాలు చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

ఇందులో కడప జిల్లాకు రూ.70 కోట్లు, అన్నమయ్య జిల్లాకు రూ.56 కోట్లు మేరకు మెటీరియల్ కాంపౌండ్ నిధుల విడుదల చేయాల్సి ఉంది. ఇందులో నుంచి ఉపాధి హామీ ఉద్యోగులకు జీతాలు, ఇతర గ్రామీణాభివృద్ధి పనులు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లాల్లో ఉపాధి హామీ ఉద్యోగులకు కనిష్టంగా రూ.15 వేల నుంచి గరిష్టంగా రూ. 50 వేలతో కూడిన చిరుద్యోగుల జీతాలు నిలిపి వేయడం ఆందోళన కలిగిస్తోంది. 2006 నుంచి ఉపాధి హామీ పథకం అమలు చరిత్రలో ఎన్నడూ ఇటువంటి ఉదాసీనత చోటుచేసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రామీణాభివృద్ధిపై ప్రభావం

కడప జిల్లాలోని 553 పంచాయతీల్లో ఉపాధి హామీ చట్టం నిధులతో అభివృద్ధి పరుగులు తీస్తోంది. ప్రతిఏటా ఉమ్మడి జిల్లాలో రూ.126 కోట్లతో సిమెంట్‌రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి తొట్లు, ఇతర విభాగాలకు చెందిన భవన నిర్మాణాలు, రహదారుల పనులు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఎస్‌సి, ఎస్‌టి జనాభా కలిగిన ప్రాంతాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనత కారణంగా నాలుగు నెలల కిందటి వరకు లేబర్ కాంపౌండ్ నిధుల విడుదలలో జాప్యం కారణంగా ఉపాధి హామీ కార్మికులకు కూలి పడని పరిస్థితి. దీంతోపాటు 2024 డిసెంబర్ 15 నుంచి మెటీరియల్ కాంపౌండ్ నిధుల విడుదలలో అంతులేని నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది ఉద్యోగులకు వేతన యాతన తప్పడం లేదు. ఫలితంగా ఉపాధి హామీ పథకం అమలును ప్రశ్నార్థకం చేస్తోంది.

మామిడి రైతు కుదేలు!

ఓవైపు ప్రకృతి వైపరీత్యం..
మరో వైపు ధరలు లేకపోవడం..
వేధిస్తున్న తెగుళ్లు
ఈ ఏడాది అధిక నష్టం

గాలులకు రాలిన మామిడి కాయలు



ప్రజాశక్తి- చాపాడు

ఓ వైపు ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే గాలులు, మరోవైపు మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో మామిడి రైతులు కుదేలవుతున్నారు. ఏటా నష్టపోతున్న తమకు ఈ ఏడాదైనా లాభాలు తెచ్చి పెడుతుందన్న ఆశలు అననుకూల వాతావరణంతో అడియాశలుగానే మారాయి. ఈ ఏడాది పూత తక్కువగా రావడం, ఈదురు గాలులకు పిందెలు, కాయలు రాలిపోతుండటంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి కడప జిల్లాలో అధికంగా రాయిచోటి , రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాలు మామిడి సాగుకు పెట్టింది పేరు. ప్రస్తుత కడప జిల్లాలో మైదుకూరు, దువ్వూరు, చాపాడు, కమలాపురం, వల్లూరు, బద్వేలు, అట్లూరు ప్రాంతాల్లో మామిడి పంట సాగులో ఉంది. తొలి విడతగా వచ్చిన మామిడి పూతలు జనవరిలో పిందెగా మారడంతో ఈ సీజన్ ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆనందపడ్డారు.

ఈ ఏడాది నష్టాలే...

ఈ ఏడాది మామిడి సాగు నష్టాలే. వర్షాలకు తోటల్లో కాయలు పూర్తిగా పాడైపోయాయి. వాతావరణం అసలు అనుకూలించలేదు. మందులు వాడినా పుచ్చులు ఎక్కువగా వచ్చాయి. ధరలు లేకపోవటం, దిగుబడులు లేకపోవటంతో పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేలా లేవని రైతులు పేర్కొంటున్నారు. నాణ్యత కలిగిన కాయలు 20 శాతానికి మించి లేకపోవడంతో రైతులు కనిష్ఠ ధరలకు మాత్రమే పరిమితమవుతున్నారు.



జివి సత్రం వద్ద సాగులో ఉన్న మామిడి తోట

వేధిస్తున్న అకాల వర్షాలు.. తెగుళ్లు

మార్చి ప్రారంభంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ 40 డిగ్రీల పైబడి నమోదయ్యాయి. ఉద్యానవన శాఖ అధికారులు వాతావరణ ఆధారిత పంటల బీమాపై కనీసం దష్టి పెట్టలేదు. ఫలితంగా రైతులు మార్కెట్లో ధర లేక మరో వైపు బీమా అమలు కాక నష్టపోతున్నామని మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికంగా గాలులు వీస్తుండడంతో మామిడికాయలు అధికంగా రాలిపోతున్నాయి.

గాలులతో తీవ్రంగా నష్టపోయాం..

ఈఏడాది మామిడి సాగుతో తీవ్రంగా నష్టపోయాం. పూత దశ నుంచి గాలులు అధికంగా విస్తుండడంతో దిగుబడి పూర్తిగా తగ్గుముఖం పట్టింది. 8 ఎకరాలు మామిడి తోటను కౌలుకు తీసుకొని తీవ్రంగా నష్టపోయాం. ధరలు కూడా నామమాత్రంగా ఉన్నాయి. ప్రభుత్వం మామిడి సాగు చేపట్టిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

- మస్తానమ్మ, మామిడి రైతు, జివి సత్రం

దిగుబడి తగ్గి నష్టాలు మిగిలాయి..

మామిడి సాగు చేపట్టి ఈ ఏడాది నష్టాల పాలయ్యాం. మంచి దిగుబడులు ఉంటాయని కౌలుకు మామిడి తోటను కొనుగోలు చేస్తే సాగు గణనీయంగా తగ్గింది. ప్రారంభంలో పూత బాగున్నప్పటికీ గాలులతో దిగుబడి తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ఉన్న కాయలు కూడా గాలికి తెగిపడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఐదు ఎకరాలలో మామిడి తోటను కౌలుకు తీసుకొని రూ. రెండు లక్షల వరకు నష్టాలపాలయ్యాను.

-వెంకటసుబ్బయ్య, కౌలు రైతు, మైదుకూరు.

తూములు యథాతథంగా కొనసాగించాలి

సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగర పరిధిలో ఉన్న పుట్లంపల్లి చెరువు కట్ట కింద ఉన్న తూములు యథాతథంగా కొనసాగించాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని పుట్లంపల్లి చెరువు అభివృద్ధి పనులను ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పార్టీ ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ పుట్లంపల్లి చెరువు అభివృద్ధిని సిపిఎం స్వాగతిస్తోందని తెలిపారు. అభివృద్ధి పేరుతో చెరువు నీరు తూముల ద్వారా పంట పొలాలకు అందే అవకాశం లేకుండా చేయడం మంచిది కాదన్నారు. తూములు పూడ్చడం ద్వారా దాదాపు 100 ఎకరాలకు చెరువు నీరు విడుదల అయ్యే అవకాశం లేదన్నారు. వ్యవసాయ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం మార్పు చేసినా చెరువు నీరు నిండినప్పుడు చెరువు బయటికి నీరు విడుదల కావాల్సి ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ భూములను గృహ వినియోగం కోసం మార్చినా ఈ తూముల ప్రాధాన్యత కీలకమన్నారు. తక్షణమే అధికార యంత్రాంగం చెరువు కట్ట కింద తూములు యథాతథంగా కొనసాగించేలా నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్ర మంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, గోవిందు, నరసింహ, జార్జి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



పుట్లంపల్లి చెరువును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

12 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఆర్ఐఒ బండి వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఈ నెల 12 నుంచి 20 వరకు ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ఆర్ఐఒ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం సెంట్ జోసఫ్ జూనియర్ కళాశాల మరియాపురం కాన్ఫరెన్స్ హాల్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలలో మొత్తం 47 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 9 నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షా కేంద్రాలలో ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేశామని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ప్రశ్నాపత్రాలను భద్రపరిచిన స్టోరేజ్ పాయింట్ల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించామని తెలిపారు. పరీక్షలు జరిగే రోజు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి డిజిటల్ ఇన్స్ట్రుమెంట్స్, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, మొబైల్ ఫోన్స్ అనుమ తించబడవని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి మొబైల్ ఫోన్స్ తీసుకుని రాకూడదని తెలిపారు. పరీక్ష కేంద్రంలో ఎవరైనా విద్యార్థులు అస్వ స్థకు గురైతే ప్రాథమిక చికిత్స అందించేలా కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచనలు ఇచ్చామని పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఇసి మెంబర్స్, కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఆర్ఐఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

వైవీయూ ప్రగతి మన అజెండా కావాలి

- విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచాలి
- వైవీయూ విసి అల్లం శ్రీనివాసరావు



మాట్లాడుతున్న విసి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కడపఅర్బన్

విశ్వవిద్యాలయం విద్యార్థులతో నిండుదనం నెలకొనాలని, విశ్వవిద్యాలయంలో లభించే కోర్సులు, జరిగే పరిశోధనలు, నాణ్యమైన విద్య బోధన సమాజానికి తెలిసేలా ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని, తద్వారా విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఉద్బోధించారు. శుక్రవారం విసి ఛాంబర్‌లోని సమావేశ మందిరంలో విశ్వవిద్యాలయంలోని అన్ని శాఖల హెచ్‌ఒడిలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి పీజీ సెట్‌కు దరఖాస్తు చేసుకున్న, చేసుకోబోతున్న విద్యార్థుల వివరాలు తెలుసుకుని వారికి విశ్వవిద్యాలయంలో లభించే నాణ్యమైన బోధన, సహ పాఠ్యేతర కార్యక్రమాల గురించి తెలియజేసి చేరేలా చూడాలన్నారు. విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న అన్ని పరీక్షల పర్యవేక్షణలో బాధ్యతాయుతంగానూ, కఠినంగాను వ్యవహరించాలన్నారు. పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి చేయాలన్నారు. విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్టలు పెంచేవి పరీక్షల నిర్వహణ అని స్పష్టం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల ఉద్యోగోన్నతులను త్వరలో చేపడతామని వెల్లడించారు. అకాడమిక్ కన్సల్టెంట్లకు ప్రయోజనకరమైన 110 జీవోను అమలు చేస్తామని తెలిపారు. నిబంధనల మేరకే అమలు విధానం ఉంటుందన్నారు. విశ్వవిద్యాలయ పరిపాలనపరమైన విధులలో మార్పులు చేర్పులు చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేందుకు క్లాస్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తామని వివరించారు. విద్యాలయ కాన్వొకేషన్ నిర్వహణ, గౌరవ డాక్టరేట్, కొత్త కోర్సులు ఏర్పాటు గురించి చర్చించారు. ఈ సమావేశంలో వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

కవుల జయంతి నిర్వహించాలి

- ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో రాయలసీమకు సంబంధించిన కవులు, కళాకారుల జయంతులు నిర్వహించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం పాలక మండల సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కోరారు. శుక్రవారం వైవీయూ ఇన్‌ఛార్జి విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ నాటి నన్నెచోడుని కాలం నుంచి నేటి నారాయణాచార్యుల కాలం వరకు రాయలసీమలో అద్భుతమైన సాహిత్యం వెలువడిందని, సాహిత్య చరిత్ర ప్రారంభమైనప్పటి నుంచి ఇంతవరకు రాయలసీమలో ఎంతోమంది, కవులు, పండితులు, అవధానులు, విమర్శకులు ఉన్నారని పేర్కొన్నారు. వారు చేసిన సాహితీ కృషి చాలా విలువైందని, వారి ప్రతిభను భావితరాలకు అందించవలసిన అవసరముందన్నారు. నన్నెచోడ కవి, శ్రీకృష్ణదేవరాయలు, మొల్లమాంబ మొదలు రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ, కట్టమంచి రామలింగారెడ్డి, రాజశేఖర శతావధాని, గడియారం వెంకట శేష శాస్త్రి, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు, పుట్టపర్తి నారాయణాచార్యులు, మధురాం తకం రాజారాం, విద్వాన్ విశ్వం, రాచమల్లు రామచంద్రారెడ్డి, బళ్లారి రాఘవ వంటి వారు ఎంతో మంది గొప్ప కవులు, కథకులు, సాహిత్య విమర్శకులు, కళాకారులు ఉన్నారని, రాయలసీమలో సాహిత్య క్షేత్రంగా వెలుగొం దుతున్న సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం లో వారి జయంతులు నిర్వహించవలసిన అవసరముందని,ఇలా చేయడం వల్ల కవులకు, రచయితలకు, సాహితీ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. విసి సానుకూలంగా స్పందిస్తూ వీలైనంత త్వరలో గ్రంథాలయంలో ఇలాంటి సాహిత్య సంబంధమైన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.



విసికి వినతిపత్రం అందజేస్తున్న మల్లికార్జున రెడ్డి

అసంబద్ధ విధానాలను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వం పాఠశాల విద్యారంగంలో సంస్కరణల పేరుతో గందరగోళ పరిస్థితులను కల్పిస్తోందని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామసుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్టసంఘం పిలుపు మేరకు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జిల్లా అధ్యక్షులు ఖాదర్ బాషా అధ్యక్షతన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎ.శ్యామసుందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకు వస్తున్న సంస్కరణ విధానాలతో పాఠశాల విద్యకు నష్టం కలుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలు నెలకొల్పితే ఈ ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలను ఏర్పాటు చేయ డానికి ప్రయతి స్తోందన్నారు. ఒక్కో పాఠశాలకు ఒక్కోరకమైన విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రకటించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎపిటిఎఫ్ ఆద్వర్యంలో 14న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నాలు చేపట్ట నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాఅధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్సులు రమేష్ రెడ్డి, మునివర్ధన్ కుమార్, రాంభూపాల్ రెడ్డి, అబ్దుల్ సత్తార్, సుబ్బయ్య, రాష్టకౌన్సిలర్ సురేంద్రనాథరెడ్డి, సి.కె.శ్రీనివాసరెడ్డి, ఆడిట్ కమిటి సభ్యులు నరసింహకుమార్, జి.పి.వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, జిల్లాకౌన్సిలర్లు మండలాల అధ్యక్ష,ప్రధానకార్యదర్సులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

ప్రజాశక్తి - బద్వేలు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 20 నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక విశ్రాంత ఉద్యోగుల సభా భవనంలో ప్రాంతీయ సదస్సు కె.నాగేంద్రబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ స్వతంత్ర పూర్వం బ్రిటిష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ మతోన్మాద ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని చెప్పారు. ఈ లేబర్ కోడ్ల వల్ల కార్పొరేట్ల లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాద సంక్షోభ పరిస్థి తులను మోడీ మతోన్మాద ఎజెండాను అమలుపరిచేందుకు, కార్పొరేట్ శక్తులను సంతృప్తి పరిచేందుకు వాడుకుంటున్నారని పేర్కొన్నారు. ఇటువంటి కార్మిక వ్యతిరేక ప్రజావ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలకు సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్ పాల్గొంటున్నారని, ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు అందరూ కూడా సమ్మెను బలపరచడం ద్వారా మోడీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, యుటిఎఫ్ మండల నాయకులు దేవానందం, మస్తాన్, ఆవాజ్ పట్టణ అధ్యక్షులు అన్వర్ భాష, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి పి.సి కొండయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



బైక్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

కడప నగరంలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా కడప నగరంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. రాజీవ్‌రామార్గ్, ఎర్రముక్కపల్లె జంక్షన్ వద్ద వన్‌టౌన్ సిఐ రామకృష్ణ ఆదేశాల మేరకు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. కేంద్రప్రభుత్వం అలర్ట్ చేసిన నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బైకులు, ఆటోలు, లగేజీ వాహనాలను విస్తృతంగా పరిశీలించారు. సరిహద్దుల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో ప్రజలు నిరంతరమూ అప్రమత్తంగా ఉండానలి ఎస్ఐ సూచించారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కడప నగరంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగను శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రామమూర్తి నాయుడు మాట్లాడుతూ పాదచారులకు, ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసి వారి దాహార్తి చేయడం మంచి కార్యక్రమమని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎ. సుబ్బరాయుడు, తుపాకుల నారాయణ మేకల సుబ్బరాయుడు, లక్ష్మయ్య సంయుక్త కార్యదర్శులు బి.సుభాన్, రాయుడు, వెంకటసుబ్బయ్య, నాగయ్య, సత్తిరాజు, కోశాధికారి నూనె నగేష్, నారాయణ, సుబ్బరాయుడు ఉచిత మజ్జిగ వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు



హుండీల కానుకలను లెక్కిస్తున్న భక్తులు

బ్రహ్మంగారి హుండీ కానుకల లెక్కింపు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అదనపు హుండీలు 4, పర్మినెంట్ ఉండిలు 7లోని కానుకలను శుక్రవారం లెక్కించారు. రూ.47,26,627 నగదు, 8గ్రాముల బంగారం, 530గ్రాముల సిల్వర్ ఆదాయం వచ్చినట్లు మఠం పిట్‌పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు. కర్నూల్ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ సమక్షంలో హుండీల కానుకలు లెక్కించారు. ప్రతి రూపాయి మఠం అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక డిగ్రీ కళాశాల ఫీడర్ కింద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు జరుగుతున్నందున గుంత బజార్ ప్రాంతంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎఇఇ జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పార్నపల్లి రోడ్డులోని కోతి సమాధి సమీపంలో కరెంట్ పోల్ మార్పు జరుగుతున్నందున శనివారం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు రాజీవ్ నగర్ పీడర్ కింద విద్యుత్ సరఫరాలో అంతరాయం జరుగు తుందన్నారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా యథావిధిగా ఉంటుందన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖాజీపేట : మండల వ్యాప్తంగా విద్యుత్ పనుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ నాగరాజు శుక్రవారం తెలిపారు. అంతరా యాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి

పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలను తిప్పికొట్టడం హర్షణీయం

- వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

దేశం కోసం నిత్యం శ్రమిస్తున్న సైనికులకు సెల్యూట్, పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టడం హర్షణీయమని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వైసిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మన దేశం కోసం నిత్యం శ్రమిస్తున్న సైనికులకు ప్రతి ఒక్కరు సెల్యూట్ చెప్పాల్సిందే అన్నారు.

స్కీమ్‌లేవీ లేవు.. అన్ని స్కామ్‌లే..

ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదు, స్కీమ్‌లు ఏమీ లేవు కానీ.. అన్ని స్కామ్‌లే అని రవీంద్ర నాథ్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, సోషియల్ మీడియా నాయకుల వేధింపులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పెట్టుకుందన్నారు. రూ.1.70 లక్షల కోట్ల అప్పు చేసి ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని విమర్శించారు. లిక్కర్ స్కాం బయటకు తీసి అబద్ధాలే ఆరోపణలుగా కేసులు పెడుతున్నారన్నారు. అధికారులను, నాయకులను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమాంతంగా విద్యుత్ ఛార్జీలు పెంచి, పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్‌కుమార్, పాక సురేష్‌కుమార్, బాలయ్య యాదవ్, బంగారు నాగయ్య యాదవ్, త్యాగరాజు, వాసుదేవరెడ్డి, శ్రీరంజన్, బాబు పాల్గొన్నారు.

వీర జవాన్‌కు ఘన నివాళులు

ప్రజాశక్తి - ఖాజీపేట

భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో సైనికుడు మురళి నాయక్ వీర మరణం అత్యంత బాధాకరమని వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, దేశభక్తి పౌరులు ఆవేదన వ్యక్తపరిచారు. వీరజవాన్ మురళి నాయక్ మృతిపట్ల తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మురళినాయక్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. భారత్ పాక్ మధ్య జరుగుతున్న యుద్ధంలో భారతదేశ సైనికులు చూపుతున్న ధైర్య సాహసాలు, చొరవను ప్రపంచ దేశాలు గర్విస్తున్నాయని, భారత సైన్యం కీర్తి ప్రతిష్టలను కొనియాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరి కమిటీ మాజీ చైర్మన్ ఇట్టేం శ్రీరాముల యాదవ్, లక్కు పుల్లారెడ్డి, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఏసుపాదం, మైదుకూరు నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్, పత్తూరు ఉపసర్పంచ్ ముత్తూరు రమణ ఉన్నారు.

మైనార్టీ రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు : మండల పరిధిలోని మైనార్టీలకు సంబంధించి సబ్సిడీ రుణాలు ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీడీఓ వీర కిషోర్ తెలిపారు. మండలానికి సంబంధించి 18 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. యూనియన్ బ్యాంక్, ఏపీజీబీ బ్యాంకుల పరిధిలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

గంగులమ్మ మృతికి పలువురి నివాళి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని గాండ్ల వీధికి చెందిన టిడిపి నేత వేమిరెడ్డి కృష్ణారెడ్డి తల్లి వేమిరెడ్డి గంగులమ్మ శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. వైసిపి నాయకులు రామాంజనేయరెడ్డి, రామచంద్రారెడ్డి, రెడ్డయ్య, టిడిపి, కాంగ్రెసు నేతలు గంగులమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాంగ్రెస్ నేతలు వెంకటేష్, అమర్నాథ్ రెడ్డి, రమణ, నాగరాజు, ఉత్తన్న, వినయ్ ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనులతో ప్రజలకు తిప్పలు



సిద్దారెడ్డిపల్లె వద్ద లారీ వెనుక ఎగిసిపడుతున్న దుమ్ము

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బద్రిపల్లె, సోమాపురం, సిద్దారెడ్డపల్లె, ఆనందాశ్రమం, జడ్డిగారి కొట్టాలు గ్రామాల మీదుగా గ్రావెల్, మట్టి లారీలు అధికంగా తిరుగుతున్నాయి. లారీలు అధిక వేగంగా ప్రయాణిస్తుండడంతో దుమ్ము విపరీతంగా లేస్తోంది. నిత్యం అధికంగా లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు దుమ్ముధూళితో అనారోగ్య పాలవుతున్నారు. గృహాల్లోకి అధికంగా దుమ్ము వచ్చిచేరుతోంది. రోడ్డు నిర్మాణదారులు ఎలాంటి జాగ్రత్తలు పాటించకపోవడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో నీరు పడితే దుమ్ము కాస్త తగ్గుముఖం పడుతుందని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా మట్టి లోడుతో వెలుతున్న లారీలపై పట్టలు ఏర్పాటు చేయడం, నీటిని చల్లడం వంటి జాగ్రత్తలు పాటించాలని కోరుతున్నారు.

ధర్నా విరమించి విధుల్లోకి వెళ్లండి

జీతాలు మంజూరు చేయిస్తాం : కూటమి నేతలు

ప్రజాశక్తి - వేంపల్లె

పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందికి గత 5 నెలలుగా జీతాలు రాకపోవడంతో విధుల్లోకి వెళ్లకుండా రెండు రోజులుగా పంచాయతీ సిబ్బంది ధర్నా చేపట్టారు. కూటమి నేతలైన టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి జీతాలు విషయమై పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డితో చర్చించారు. జీతాలు మంజూరు చేయాలని కోరడంతో.. అందుకు ఇఒ రామసుబ్బారెడ్డి హామీ ఇచ్చారు. పంచాయతీ సిబ్బందితో నేతలు చర్చించి అందరికి జీతాలు మంజూరయ్యేందుకు కృషి చేస్తామని ధర్నాను విరమింపజేశారు. ఈ సందర్భంగా రామమునిరెడ్డి, షబ్బీర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు ప్రస్తుతం ఒకొక్కరికి రూ.10 వేలు చొప్పున చెల్లిస్తామని ఇఒ హామీ ఇచ్చినట్లు చెప్పారు. గ్రామపంచాయతీలో రూ.16 లక్షలు ఉన్నాయని, వాటిని సిబ్బంది జీతాలు కోసం ఉపయోగిస్తామని ఇఒ చెప్పారన్నారు. ముందుగా జీతాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని ఇఒను కోరామన్నారు. ఈనెలాఖరకు మార్కెట్ టెండర్ వేసి వచ్చిన ఆదాయంతో సిబ్బందికి మొత్తం జీతాలు చెల్లిస్తామని కార్మికులకు ఇఒ హామీ ఇచ్చారని తెలిపారు. కాంట్రాక్టర్లుకు బిల్లులు ఇవ్వాల్సిన అవసరం లేదని, ముందు కార్మికుల జీతాలకు, తాగునీటి ఎద్దడి నివారణకు నిధులు ఖర్చు పెట్టాలని ఇఒను కోరినట్లు చెప్పారు. తమ హామీని ఒప్పుకొని ధర్నాను విరమించిన కార్మికులకు, ఇఒకు నేతలు కృతజ్ఞతలు తెలిపారు.



కార్మికులతో మాట్లాడుతున్న టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి

వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించండి



ఆర్‌డికి వినతిపత్రమిస్తున్న ఎన్‌జిజిఒ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

వైద్య ఆరోగ్యశాఖ ఆర్‌డి పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలని ఎపి ఎన్‌జిజిఒ నాయకులు కోరారు. ఆ మేరకు శుక్రవారం వారు కడప రీజినల్ డైరెక్టర్ డాక్టర్ బి.రామగిడ్డయ్యను కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, అనంతపురం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, మాధవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, డి.చంద్రమోహన్, జిల్లా మహిళ కన్వీనర్ జమీలా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో 30 సంవత్సరాల నుంచి ఎఎన్‌ఎంగా పనిచేస్తున్నా ఇంత వరకు ప్రమోషన్‌లు కల్పించలేదని తెలిపారు. ఇప్పుడు కడప రీజియన్ పరిధిలోని అన్ని సూపర్‌వైజర్ ఫిమేల్ ఖాళీలను ప్రమోషన్లతో భర్తీ చేయాలని కోరారు. కడప రీజియన్ పరిధిలోని అన్ని క్యాడర్స్ పిహెచ్‌ఎన్, ఎంపిహెచ్‌ఇఒ, ఫార్మసీ సూపర్‌వైజర్ ఉద్యోగోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఆర్‌డి డాక్టర్ రామగిడ్డయ్య త్వరలో సీనియార్టీ జాబితా సిద్ధం చేసి ఇస్తానన్నారు. అనంతపురం, కడప ఉద్యోగులు పాల్గొన్నారు.

టెయిలింగ్ పాండ్ వద్ద ప్రజల నిరసన



వాహనాలను అడ్డుకున్న కెకె కొట్టాల గ్రామ ప్రజలు

ప్రజాశక్తి - వేముల

వేముల మండలంలోని స్థానిక కొట్టాల గ్రామం వద్ద రసాయనాలతో విడుదలయ్యే వ్యర్ధ పదార్థాలను నిల్వచేసే టెయిలింగ్ పాండు వద్ద మిషన్లు మరమ్మత్తులు చేస్తున్న పనిని తెలుసుకున్న కెకె కొట్టాల గ్రామ ప్రజలు శుక్రవారం అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. గతంలో కూడా టెయిలింగ్ పాండ్ నిర్మాణ పనులు చేపట్టాలనే ఆలోచనతో పనులు సాగించాలని, మిషన్‌లను తీసుకొని ముందుకు వచ్చారు. విషయం గమనించిన కెకె కొట్టాల ప్రజలు కలిసి ముక్తకంఠంతో అందరూ అక్కడికి చేరుకుని నిరసన చేశారు. అధికారులు స్పందించి మీ సమస్యలు పరిష్కారం జరిగే ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టబోమని యుసిఐఎల్ అధికారులు రైతులకు వివరించారు. సమస్యలకు పరిష్కారం జరగక మునుపే మళ్లీ యుసిఐఎల్ యాజమాన్యం మళ్లీ కూడా విశ్వ ప్రయత్నాలు చేసి టెయిలింగ్ పాండ్‌లో చిన్నచిన్న మరమ్మతులు చేయాలని ఆలోచనతో శుక్రవారం మళ్లీ మిషన్ల సహాయంతో పనిచేయడానికి ప్రయత్నించారు. సమాచారాన్ని తెలుసుకున్న గ్రామ ప్రజలు, రైతులు టెయిలింగ్ పాండ్ వద్దకు చేరుకొని జరుగుతున్న పనిని ఆపి, మిషన్లను వెనక్కి పంపారు.



రైతులను అడ్డుకున్న యుసిఐఎల్ పోలీసులు

బాల్య వివాహాలతో పలు అనర్థాలు



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

బాల్య వివాహలు చట్ట రీత్యా నేరమని, పలు అనర్థాలు కలుగుతాయని కామనూరు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ పేర్కొన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిషోర వికాసం-వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అన్ని సచివాలయాల్లో పునరుత్పత్తి, ఆరోగ్యం-బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావలపై అవగాహన పెద్దశెట్టిపల్లెలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కిశోర బాలికలు రుతుక్రమం వచ్చినప్పుడు తీసుకో వాల్సిన జాగ్రత్తలు, బాలికల యుక్త వయసులో వచ్చే మార్పులు, తీసుకో వాల్సిన పోషక ఆహారం, బాల్య వివాహల వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఒ క్రిష్ణమ్మ, సూపర్‌వైజర్ బిఎ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎఎన్‌ఎంలు సుజాత, లలిత, మహిళా పోలీస్ శ్రీలక్ష్మి, అంగన్వాడీ టీచర్స్ రాజ్యలక్ష్మి, హాజరాబీ, మహాలక్ష్మి, తులసి, కిషోర బాలికలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని ఆరోగ్య బోధకురాలు శోభారాణి అన్నారు. స్థానిక శాస్త్రనగర్ రజకవాడ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిషోర్ వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాన్ని మహిళా పోలీస్ యామిని నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ సుబ్బారెడ్డి, గంగాభవాని, రమణమ్మ, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ముద్దనూరు : గర్భిణులు క్రమం తప్పకకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సలహాలు పాటించాలని పిహెచ్‌సి వైద్యాధి కారులు శ్రీకాంత్, నాగార్జున్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం శ్రీకాంత్, నాగార్జున్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గైనకాలజిస్ట్ ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ తేజ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, స్కానింగ్ చేశారు. ఇందులో ముగ్గురు ప్రమాదకరంగా ఉన్నారని, ప్రసవ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తేజ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవిస్తే ప్రభుత్వం ఇచ్చే పరిహారం పొందవచ్చని వైద్యాధికారులు తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి ప్రసాద్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, పర్యవేక్షకులు శోభకుమారి, రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా : డిఇ

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటిలో విద్యార్థులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందించినట్లు డిఇ వెంకట నాగేంద్ర తెలిపారు. శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు చెట్లు కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో రెండు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి సిబ్బందితో మరమ్మతులను త్వరితగతిన చేయించారు. యథావిధిగా విద్యార్థులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందించారు. విద్యుత్‌ను సకాలంలో అందించినందుకు ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ అభినందించారు. ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో ఉన్న పియుసి-1 విద్యార్థులకు సెమిష్టర్-2 పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి విద్యుత్ సమస్యలతో ఇతర సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



రోడ్డుపై చేరిన మురుగునీరు

రోడ్డుపై మురుగునీరు.. ప్రజల్లో ఆందోళన

ప్రజాశక్తి - గోపవరం

గోపవరం మండలం బెడుసుపల్లి పాఠశాల సమీపంలో రోడ్డుపై మురుగు నీరు చేరింది. ఆ రోడ్డుపై వెళ్లాలంటే స్థానికులు హడలిపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు పంచయతీ అధికారులకు విన్నవించినా ఫలితంలేదు. మురుగు చేరడంతో దోమలు అధికంగా ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుమీద నీరు ఉండడంతో అక్కడ పాచిపట్టి వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్కడ నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ కొంగాని వెంకటసుబ్బయ్య

ప్రజల సహకారంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - ఖాజీపేట

గ్రామపంచాయతీలు అభివృద్ధి సాధించాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని, సకాలంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం పంచాయతీ సాధారణ సర్వసభ్య సమావేశం సర్పంచ్ కొంగాని వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు.

20లోపు అన్నదాత సుఖీభవ దరఖాస్తుకు అవకాశం

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 20 వరకు గడువు ఉందని, అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం మండల వ్యవసాయ అధికారిణి నాగార్చన కోరారు. రైతు సేవా కేంద్రాలలో సిబ్బంది ద్వారా నమోదు చేసుకోవాలని, ఆధార్ కార్డు, భూమి వివరాలతో సిబ్బందిని సంప్రదించి తన పేర్లను పరిశీలించుకోవాలని చెప్పారు. అర్హత కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

చేపల కోసం వెళ్లి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - లింగాల



మృతి చెందిన హాజరత్తయ్య

కుటుంబ పోషణ కోసం భవన కార్మికుడు వలస వచ్చి చేపల వేటకు వెళ్లి మృతి చెందిన సంఘటన మండలం పరిధిలోని కామసముద్రం చెరువులో శుక్రవారం చోటుచేసుకుంది. సత్యసాయి జిల్లా కదిరి మండలం చింతకుంట పల్లెకు చెందిన ఎల్లనూరు హాజరత్తయ్య (69) భవన నిర్మాణ కార్మికుడిగా పని నిమిత్తం కామసముద్రం గ్రామంలో గత రెండు నెలలుగా నూతన ఇంటి నిర్మాణం చేపట్టాడు. పని ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో సమీపంలోని చెరువులో తోటి కార్మికులతో ఉదయం 6 గంటల సమయంలో చేపల వేటకు వెళ్లాడు. చెరువు లోతు ఉన్న ప్రాం తంలో వెళ్లి, ఊపిరి ఆడకపోవడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. గుర్తించిన స్నేహితులు అతని కోసం గాలింపు చేపట్టగా అప్పటికే హాజరత్తయ్య మృతి చెం దాడు. మృతదేహాన్ని వెలికితీసి కుటుంబ సభ్యులకు సమాచారం అం దించారు. సంఘటనపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

ఏడాది కిందట తల్లి మృతి.. ఒంటరిగా మిగిలిన కుమార్తె

ప్రజాశక్తి - చక్రాయపేట



మృతుడు రామిరెడ్డి(ఫైల్‌ఫొటో)

మండలంలోని కుప్పం పంచాయతీ బురుజుపల్లె కాలనీకి చెందిన మూలి రామిరెడ్డి(52) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. స్కూటర్‌పై వేంపల్లిలో వారి బంధువుల వివాహానికి వెళ్లి తిరిగి సొంత గ్రామం బురుజుపల్లి కాలనీకి వస్తుండగా, రాయచోటి-వేంపల్లి మెయిన్ రోడ్డులోని మారెళ్లమడక సమీపంలో మృతుడి బంధువు కొండారెడ్డి స్కూటర్ తోలుతుండగా వెనుక రామిరెడ్డి కూర్చుని వెళుతుండగా బైక్ పక్కన పడింది. మృతుడు రామిరెడ్డి భార్య గతేడాది అనారోగ్యంతో చనిపోయింది. ఉన్న ఒక్క కుమార్తె శ్రీమణికి వివాహం కాలేదు. కుమార్తెకు ఒంటరిగా దిక్కులేని పరిస్థితి ఏర్పడింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మృతుడి కుమార్తెకు ప్రభుత్వం ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

వివిధ కేసుల్లో 9 మంది అరెస్టు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామ సమీపంలో జూదం, గంజాయి అమ్మకం సాగిస్తున్న కేసుల్లో తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు సిఐ ఆర్.మోహన్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో శుక్రవారం సిఐ విలేకరులతో మాట్లాడుతూ చెన్నముక్కపల్లె సమీపాన తూర్పు వైపున కోళ్ల ఫారం సమీపంలో గంజాయి అమ్మకంతోపాటు జూదం ఆడుతున్న వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి రూ.20,500విలువైన గంజాయి, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని సిఐ వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి మైదుకూరు కోర్టులో ప్రవేశ పెట్టామన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో సిఐ, సిబ్బంది